
జిల్లా కేంద్రంలో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా..


బిజినేపల్లిలో మహాగణపతి హోమం


మన్ననూరులో పూజలు చేస్తున్న భక్తులు


కల్వకుర్తి విద్యానగర్‌కాలనీలో పూజలందుకుంటున్న గణనాథుడు


అచ్చంపేటలో అన్నదానం

ఘనంగా గణనాథుడికి పూజలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాలుగో రోజు శనివారం జిల్లా వ్యాప్తంగా మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు వినాయకుడిని నిమజ్జనం చేశారు. పెద్దకొత్తపల్లి మండలం పెద్ద కారుపాముల జై భజరంగ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో, అచ్చంపేట, చారకొండలో అన్నదానం చేశారు. బిజినేపల్లిలో హోమం నిర్వహించారు. తెలకపల్లి, మన్ననూరు, చారకొండ, వెల్దండలో బతుమ్మలు, కోలాటాలు ఆడారు. – సాక్షి, నెట్‌వర్క్

అధిక వర్షాలతో.. అపార నష్టం

- దిక్కుతోచని స్థితిలో పత్తి, వరి రైతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


మర్రిపల్లి సమీపంలో జాలువారి నష్టపోయిన పత్తి పంట

ఉప్పునుంతల: వానాకాలంలో సాగు చేసిన పత్తి, ఇతర మెట్ట పంటలు ఇటీవల ఎడతెరపి లేకుండ కురిసిన వర్షాలు అపార నష్టాన్ని కల్గించాయి. పెరిగిన పత్తి పంట వర్షాల తాకిడికి మొక్కలు ఒరిగాయి. మొక్క ఆకుతో నిండుగా కన్పిస్తున్నా కాయలు మాత్రం ఆశించినంతగా లేకపోవడం రైతులను నిరాశకు గురిచేస్తుంది. దానికి తోడుగా వంపులు, చెరువులు, కుంటలు, కేఎల్ఐ కాల్వలకు దిగువన ఉన్న పొలాలు పూర్తిగా జాలుబారి పంట పొలాల్లోనే నీరు ఉబికివస్తుంది. దాంతో పంట మొక్కలు చనిపోతున్నాయి. వరినాట్లు వేసుకున్న తరిపొలాల వెంట జాలు, ఇతర అలుగునీరు ప్రవహిస్తుండటంతో పంట కోలుకోలేని స్థితిలో ఉంది. వానాకాలం పంట పరిస్థితి ఈ విధంగా ఉంటే పొలాల్లో తేమ శాతం అధికంగా ఉండటంతో యాసంగిలోను వేరుశెనగ పంట దిగుబడి వస్తుందనే ఆశలేదని రైతులు వాపోతున్నారు. మండలంలో రైతులు వానాకాలం పంటగా 23 వేల ఎకరాల్లో పత్తిని సాగుచేయగా వరి పంట 10 వేల ఎకరాల్లో, మొక్కజొన్న 1150 ఎకరాల్లో సాగుచేశారు. ఇక జొన్న, కంది పంటలు అక్కడక్కడ కన్పిస్తున్నాయే తప్పా అంతగా సాగులేదు.

దెబ్బతిన్న పంటలు

ఏ సంవత్సరం వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి మండలంలో వర్షాలు సాధారణ వర్షపాతం కంటే ఎక్కుకగా పడ్డాయి. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 72.9 మిల్లీమీటర్లు కాగా 107.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జులై నెలలో సాధారణ వర్షపాతం 106.2 మిల్లీమీటర్లు కాగా 188.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అదేవిధంగా ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం 117.7 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 403.1 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఆగస్టు నెలలో పడిన అధిక వర్షాలే పంటలకు నష్టం కల్గించాయి.

పత్తి పంటకు నష్టం వాటిల్లింది..



ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పత్తి పంటకు పూర్తిగా నష్టం వాటిల్లింది. ఈ ఏడాది పంట ఎదుగుదల బాగుందని అందరం సంతోషపడ్డాం కాని వర్షాలు నిండాముంచాయి. పంట చూస్తే గుబురుగా కన్పిస్తుందే తప్పా కాయలు లేవు. కాయ పట్టే సమయంలోనే గూడ రాలిపోయింది. రు ఎకరాల్లో పత్తి పంటను వేశారు. లోతట్టు, వంపు ప్రాంతాల్లో ఉన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

– సోనమోని సైదులు యాదవ్, రైతు, మర్రిపల్లి

నీరు నిల్వలేకుండా చూసుకోవాలి



వర్షపు నీటితోపాటు జాలువారుతున్న పంట పొలాల్లో అంచు వెంట కందకాలు తీసుకొని నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. ప్రస్తుతం రెండు, మూడు రోజుల నుంచి ఎండ వస్తుండటంతో పంటలకు కొంత మేలుచేస్తుంది. నీరు నిల్వఉంటే మొక్కలు చనిపోతాయి. వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలు ప్రభుత్వం కోరితే వెంటనే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.

– కొత్ర రమేష్ నాయక్, ఏఓ, ఉప్పునుంతల

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొల్లాపూర్: నియోజకవర్గంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు తాటికొండ కృష్ణ, రాంచంద్రయ్య కోరారు. శనివారం వారు జిల్లా కేంద్రంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలిశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం బొంగరాలమిట్ట ప్రాంతంలో గతంలో భూమి కేటాయించారని వివరించారు. ఆ స్థలంలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరుచేయాలని కోరారు. పట్టణంలో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లిఖార్జున్, జలకం మద్దిలేటి, బి.కురుమయ్య, బాదం పరమేష్ ఉన్నారు.

అపార్ ఐడీ నమోదు చేయించాలి



లింగాల: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి యొక్క అపార్ ఐడీని నమోదు చేయించాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంతో పాటు, అంబట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలను శనివారం ఎంఈఓ ఆకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వంద శాతం ఎఫ్ఆర్ఎస్‌ను పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



ఉప్పునుంతల: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం వైఆర్‌జీ, కేర్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సెమినార్ నిర్వహించారు. సీఎల్‌డబ్ల్యూలు హేమలత, జ్యోతి హెచ్ఐవీపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ ఏవిధంగా సోకుతుంది, వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషలాఫీసర్ సైదా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయాలి



కోడేరు: మండలంలో ఉన్న వృద్ధాప్య, దివ్యాంగుల, ఒంటరి మహిళలకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు నర్సింహ మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి పింఛన్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రవి, రాంకుమర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



కల్వకుర్తి రూరల్: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. శనివారం చుక్కాపూర్‌లో లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో పాఠశాలను ఆయన సందర్శించారు. వేద పాఠశాల అభివృద్ధికి రూ.3 లక్షలతో గ్రానైట్ పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర శర్మ, నరసింహ, మల్లయ్య, వెంకటయ్య, యాదయ్య, దశరథం ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

10న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కందనూలు: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని సత్యసాయి సేవా సంస్థలు సెప్టెంబర్ 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హాకీంవిశ్వ ప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచనకు సంబంధించిన కరపత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో, ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి వెంకటరమణకు అందించారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అధ్యక్షుడు గుబ్బ శంకరయ్య, జిల్లా విద్యా విభాగం సమన్వయకర్త మంద.రమేష్, పి.రాజశేఖర్ రావు, వెంకట్ శెట్టి, సభ్యులు బిల్లకంటి మధు, విజయ భాస్కర్, గంధం భాస్కర్, గంధం రాజు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి సర్వే



వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల–పెద్దాపూర్‌లో వంతెన నిర్మాణానికి శనివారం డీఈఈ బస్వలింగం, అధికారులు సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిధుల నుంచి రూ.2.50కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. గతంలోనే ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వంతెన నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు గుర్తు చేశారు. ఇటీవల వర్షాలు కురవడంతో పనుల్లో జాప్యం ఏర్పడిందన్నారు. అనంతరం కొలతలు వేసి పనుల సర్వే చేశారు. కార్యక్రమంలో పీఆర్‌డీఈఈ బస్వలింగం, ఏఈలు సురేందర్‌రెడ్డి, మహేందర్, కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

వైద్యుడు రాములు నాయక్‌కు నివాళి



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీహెచ్‌సీలో జనరల్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాములు నాయక్ (55) ఆకస్మికంగా మృతి చెందారు. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన రాములు నాయక్ రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. హైదరబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుండగా శనివారం ఉదయం గుండెపోటు రావటంతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శనివారం సీహెచ్‌సీలో ఆయన చిత్రపటానికి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి


పరిశీలిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

అచ్చంపేట రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని డీఈఓ రమేష్‌కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టీఎల్ఎం మేళాను డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ తరగతి గదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగం విద్యార్థుల అభ్యసన అభివృద్ధికి మార్గమన్నారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆసక్తి, వినూత్న ఆలోచనలు పెరుగుతున్నాయన్నారు. పాఠ్య విషయాలను స్పష్టంగా, సరళంగా అర్థమయ్యేలా చేయడంలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గ్రాఫిక్స్, మోడల్స్, ఫ్లాష్ కార్డులు, ఆటల రూపంలో ఉన్న ఉపాధ్యాయ సహాయక సామగ్రి విద్యార్థుల దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలకపల్లి: తరగతి గదిలో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగిస్తూ విద్యార్థులకు బోధన కొనసాగించాలని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రదర్శనలతో బోధించాలి

వెల్దండ: విద్యార్థులను ఆకర్షించే విధంగా మెళకువలతో కూడిన విద్యను అందించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మోడల్‌హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాను తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌తో కలసి ఆయన ప్రారంభించారు. మండలంలోని ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకొచ్చిన ఆసక్తికర అంశాలను ప్రదర్శించారు. అనంతరం ఆసక్తికర అంశాలను అజిలాపూర్, వెల్దండ, కొత్ర, బండోనిపల్లి, గొల్లోనిపల్లి, పోతేపల్లి, కుప్పగండ్ల, గుండాల పాఠశాలలు జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ప్రతి పాఠశాలకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం రవీందర్, శ్రీనివాసులు, ప్రేమకుమారి, సుగుణ, ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, సునీత, మహేశ్వరీ, రాజశేఖర్, ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, జిలాని, రాఘవేందర్, హరిప్రసాద్‌రాజు, పద్మ, సురేందర్, ఖాజా, రాములు, విష్ణు, దాసు తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం


తిమ్మాజిపేటలో మాట్లాడుతున్న ఎంపీడీఓ


కల్వకుర్తిలో సమావేశానికి హాజరైన నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో శనివారం ముసాయిదా ఓటరు జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించడానికి శనివారం అధికారులు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం అయ్యారు. వార్డుల వారీగా ఓటర్ తుది జాబితాను పోలింగ్ స్టేషన్ల వారీగా వివరించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆదివారంలోగా తెలపాలని కోరారు. కల్వకుర్తి ఎంపీఓ విజయ్‌భాస్కర్, ఉప్పునుంతల, అమ్రాబాద్, ఊర్కొండ, తాడూరు, తిమ్మాజిపేట ఎంపీడీఓలు మోహన్‌లాల్, లింగయ్య, కృష్ణయ్య, ఆంజనేయులు, లక్ష్మీదేవిలు పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారి


గుంతలమయంగా రోడ్డు

కల్వకుర్తి రూరల్: మండలంలోని కురుమిద్ద మాదారం రోడ్డు గుంతల మయంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతలు పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. రెండు మండలాలకు ప్రధాన రహదారిగా ఉన్న బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎలికట్ట, జీడిపల్లి తోపాటు పలు గ్రామాలకు ఆటోలో వెళ్లేవారికి తిప్పలు తప్పడం లేదు. ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలైన ఘటనలు ఉన్నాయి. రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం

శిథిలావస్థలో పాఠశాల భవనం

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి పాఠశాలల తాత్కలిక మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సురవరం ఆశయ సాధనకు కృషి



తాడూరు: సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. శనివారం మండలంలోని అంతారంలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రేణుక, పద్మ, మైసమ్మ, బంగారయ్య, యశోదమ్మ, శైలజ పాల్గొన్నారు.

తిరునామ్‌పల్లిలో సీపీఎం సర్వే



పెద్దకొత్తపల్లి: మండలంలోని తిరునామ్‌పల్లిలో నెలకొన్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో శనివారం సర్వే చేపట్టారు. తాగునీటి సమస్య అధికంగా ఉందని సీపీఎం మండల కార్యదర్శి దశరథం పేర్కొన్నారు. ఫ్లోరైడ్ సమస్య ఉండటంతో గ్రామ ప్రజలకు కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారన్నారు. కార్యక్రమంలో శేషయ్య, పాపయ్య, సత్యం, చంద్రశేఖర్, నర్సింహ, బాలయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అచ్చంపేట రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అచ్చంపేట సివిల్ కోర్టు జడ్జి స్పందన కోరారు. శనివారం పట్టణంలోని బాలసదన్, వృద్ధాశ్రమాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న సేవలు, భోజన వసతులు, ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థినులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గూర్చి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

చారకొండ: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధ్యమని ఏఈఓ వంశీ అన్నారు. మండలంలోని సిర్సనగండ్లలో శనివారం పంటపొలాల్లో వరి, పత్తి పంటలను పరిశీలించారు. పత్తి పంటలో ఆశించిన తెగుళ్లు గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



దరఖాస్తు చేసుకోండి

అమ్రాబాద్: నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ శైలేంద్రకుమార్ తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయసు ఉన్న మహిళలు భర్త మృతి చెంది కుటుంబ పోషణ భారమైన మహిళలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. పతకంలో భాగంగా ప్రభుత్వం నుంచి రూ.20 వేల ఆర్థికసాయం అందుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తి రూరల్: పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిలక్ నగర్, విద్యానగర్, యూనియన్ బ్యాంక్, తిమ్మినోనిపల్లి రోడ్డు, కల్యాణ్ నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన కటికె శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. శనివారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, గ్రామ బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి రూ.11వేలు ఆర్థిక సహకారం అందించారు. మాజీ సర్పంచ్ సుశీల, జాగృతి జిల్లా అధ్యక్షుడు గణేష్, మైబు యాదవ్, నిరంజన్, మల్లేష్ యాదవ్, పరశురాములు తదితరులు ఉన్నారు.

తప్పులు లేకుండా చూసుకోవాలి

తిమ్మాజిపేట: ధ్రువపత్రాల నమోదులో తప్పులు లేకుండా నమోదు చేయాలని మీసేవ కేంద్రాల నిర్వాహకులకు తహసీల్దార్ రామకృష్ణయ్య సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మీసేవ, ఆన్‌లైన్ సెంటర్ల ఆపరేటర్లతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పొరపాట్లు లేకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో డీటీ జ్యోతి, తిమ్మాజిపేట, గుమ్మకొండ, పోతిరెడ్డిపల్లి ఆపరేటర్లు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడవాలి



కొల్లాపూర్: ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలని అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీస్వామి అన్నారు. శనివారం ఆయన పట్టణంలో తెలుగువీధిలో ఏర్పాటు చేసిన శివగంగ యువక బృంద వినాయకుని విగ్రహాన్ని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను మాట్లాడారు. దైవభక్తితో మానసిక ధృడత్వం ఏర్పడుతుందని, తద్వారా మనిషి సన్మార్గంలో అనుకున్న పనులు సాధించవచ్చన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు ఇచ్చారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు ఆయనను సత్కరించారు.

మక్కుతున్న దొడ్డు బియ్యం




దొడ్డు బియ్యంలో పురుగులు, కల్వకుర్తిలోని ఓ రేషన్‌దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం సంచులు

- జిల్లావ్యాప్తంగా 558 రేషన్ దుకాణాలు
- 1,258 మెట్రిక్ టన్నుల నిల్వ
- రూ.కోట్లాది ప్రజాధనానికి పురుగులు

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం గతంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసిన దొడ్డు బియ్యం రేషన్ షాపుల్లోనే మక్కుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉగాది పండుగ నుంచి జిల్లాలోని 558 రేషన్ షాపుల ద్వారా సన్నం బియ్యం సరఫరా చేస్తోంది. కాగా.. అంతవరకు షాపుల్లో ఉన్న దొడ్డు బియ్యం అలాగే ఉంచడంతో సమస్య వచ్చింది. జిల్లాలోని చాలా రేషన్ షాపుల్లో బియ్యం నిల్వ ఉంచుకునే సామర్థ్యం లేకపోవడంతో పాటు అవి కూడా చాలా వరకు రేకులు, తాత్కాలిక భవనాల్లో కొనసాగుతుండడంతో వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ఆరు మాసాలుగా..

ఆరు మాసాలుగా దొడ్డు బియ్యం ఒకే చోట నిల్వ ఉండడంతో వాటికి పురుగులు పట్టాయి. కొన్ని రేషన్ షాపుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు బియ్యం సంచులు తడిసిపోయాయి. దీంతో బియ్యం ముక్కపట్టి పనికిరాకుండా పోతుంది. జిల్లాలోని 558 రేషన్ షాపుల్లో 1,257 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వ ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసే సమయంలో దొడ్డు బియ్యం నిల్వను వెంటనే వెనక్కి తీసుకొని ఉంటే ఆ బియ్యం ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే అవకాశం ఉండేది. ఒక జిల్లాలోని ఇన్ని మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయంటే రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని లక్షల క్వింటాళ్ల బియ్యం ఉన్నాయో అవగతం అవుతుంది. రూ. కోట్లాది ప్రజాధనం వృథాగా పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు నివేదించాం

జిల్లాలో రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం గురించి పౌరసరఫరాల శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడిన వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం. – నరసింహ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి